## మేడిగడ్డ వరద ప్రవాహ అంచనాపై నేటి నుంచి పరీక్షలు



మేడిగడ్డ బరాజ్

మహదేవపూర్, సెప్టెంబర్ 10 మేడిగడ్డ బరాజ్‌లో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు నేటి నుంచి వరద ప్రవాహ అంచనా పరీక్షలు ప్రారంభించనున్నారు. పుణెకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ సంపత్, నాగరాజు ఆధ్వర్యంలో ఏడీసీసీ (అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫెల్లర్) పరికరాన్ని బోటుకు అమర్చి పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం బరాజ్ వద్ద వరద ప్రవాహం సుమారు 4 లక్షల క్యూసెక్కులు నమోదై దిగువకు పోతున్నది. నాటు పడవలు కాకుండా ప్రత్యేకంగా లక్నవరం నుంచి బోటును మంగళవారం మేడిగడ్డ బరాజ్‌కు అధికారులు తెప్పించారు. ఈ బోటుకు ఏడీసీసీ పరికరాన్ని అమర్చి వరద ప్రవాహ తీవ్రతను అంచనా వేయనున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.



పురుషోత్తమాయగూడెం వద్ద ధ్వంసమైన ఎన్‌హెచ్-365 (ఫైల్)

# నేడు మానుకోటకు కేంద్ర బృందం

- వరద నష్టం అంచనాకు రానున్న అధికారులు
- ఢిల్లీ నుంచి రెండు బృందాల రాక
- పలు మండలాల్లో పర్యటన

మహబూబాబాద్, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ జిల్లాకు బుధవారం కేంద్ర బృందం రానున్నది. ఇటీవలి అతి భారీ వర్షాలు, వరదలతో జిల్లాలోని పలు గ్రామాలు నీట మునిగి, పంటలు కొట్టుకుపోయిన క్రమంలో నష్టాన్ని అంచనా వేసేందుకు ఢిల్లీ నుంచి రెండు బృందాలు పర్యటించనున్నాయి. మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఈ బృందాలు బుధవారం ఉదయం నేరుగా ఖమ్మం, మధ్యాహ్నం మహబూబాబాద్ జిల్లాకు చేరుకుంటాయి. ఒక బృందం మరిపెడ మండలం ఉల్లెపల్లి, సీతారాంతండాలో పర్యటించనున్నది. పురుషోత్తమాయగూడెం బ్రిడ్జిని, వరదలకు కొట్టుకుపోయిన జాతీయ రహదారిని పరిశీలించనుంది. రెండో బృందం డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి బ్రిడ్జితో పాటు వరదకు కొట్టుకుపోయిన పంట పొలాలు, తెగిన చెరువులను పరిశీలించనున్నది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

**వరదలతో అపార నష్టం..**

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 55 చోట్ల రోడ్లు దెబ్బతినగా, మరో 25 చోట్ల రోడ్లు కోతకు గురైనట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 18 కిలోమీటర్ల మేర రహదారులకు నష్టం వాటిల్లింది. తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ.2 నుంచి 3 కోట్ల వరకు ఖర్చువువుతుందని అధికారులు అంచనా వేశారు. రోడ్లు భవనాలు శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 25 రహదారులు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులకు రూ. 3 నుంచి రూ. 5 కోట్లు అవసరమని అంచనా వేశారు. జాతీయ రహదారుల శాఖ పరిధిలోని వివిధ రోడ్లు దెబ్బతిన్నాయి. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద సుమారు పది చోట్ల రోడ్డు ధ్వంసమైంది. రెండు కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా 1,590 చెరువులు ఉండగా. 127 చెరువులు దెబ్బతిన్నాయి. ఇందులో 55 చెరువుల కట్టలు పూర్తిగా తెగిపోయాయి. మరో 72 చెరువులకు గండ్లు పడ్డాయి. సుమారు 50వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. వేల ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరాయి. మరో 30 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మక్కజొన్న, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. డోర్నకల్ మండలం దుబ్బతండా, మరిపెడ మండలం సీతారాంతండా, నెల్లికుదురు మండలం రావిరాల గ్రామాలు నీట మునిగి ప్రజలకు నిలువనీడ లేకుండా పోయింది.

**పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ సీజన్‌కైనా రంది లేకుండా సాగునీరందడంతో రైతన్న ధీమాగా పంటలు వేశాడు. పుష్కలంగా ఉన్న భూగర్భ జలాలు, ప్రాజెక్టుల నుంచి వచ్చే నీళ్లతో పుట్లకొద్దీ పంటలు పండించాడు. కానీ ఈసారి సకాలంలో సాగునీరందక దిక్కుతోచని రైతన్నను కాంగ్రెస్ సర్కారు మాత్రం పట్టించుకోలేదు. ప్రాజెక్టుల నుంచి చెరువులకు, తద్వారా పంటలకు నీళ్లు విడుదల చేసే అవకాశమున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సర్కారు పట్టింపులేమితో సాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో పంటల సాగు కూడా తగ్గింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలే రైతులకు దిక్కయ్యాయి. సీజన్ చివరి దశకు చేరిన సమయంలో ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ చెరువులు వాన నీటితో నిండడంతో పంటలకు ఊపిరి పోసినట్లయింది. అయితే వరుణుడు భరోసా ఇచ్చినా.. పంట సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది.**

*- వరంగల్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



మత్తడి పడుతున్న ఎల్బూర్‌చెరువు (ఫైల్)

# వాన నీళ్లే దిక్కయినయ్!

## ముందస్తు ప్రణాళిక లేని కాంగ్రెస్ సర్కారు



నిండుకుండలా చలివాగు జలాశయం (ఫైల్)

- ప్రాజెక్టుల నీళ్లు ఇవ్వకుండా నీటి నిర్వహణపై నిర్లక్ష్యం
- సీజన్ చివరలో వర్షాలతోనే నిండిన చెరువులు
- పంటలకు భరోసానిచ్చిన వరుణుడు
- వానాకాలం సాగుపై రైతుల్లో ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటి నిర్వహణ అయోమయంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల నుంచి చెరువులు, పొలాలకు నీళ్లు సరఫరా చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ పరిస్థితులతో గతేడాది యాసంగి పంటల సాగు సరిగా సాగలేదు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎక్కువ ప్రాంతాల్లో వరి నాట్లు వేయలేదు. చెరువులకు నీటి సరఫరా లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బావులు ఎండిపోయాయి. సాగునీటిపై భరోసా లేకపోవడంతో వానకాలంలోనూ పంటల సాగు ఆశించిన మేర లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ వైఫల్యంతో పంటల సాగు తగ్గింది. సాగు చేసిన పంటలకు భరోసా లేకుండా పోయింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు పంటలకు ఊపిరిపోశాయి. మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికంగా వానలు పడ్డాయి. హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల్లోనూ వారం రోజులు వానలు పడడంతో రైతులకు ఊరట కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయకున్నా ప్రకృతి కరుణించడంతో వానలు వచ్చి చెరువులు నిండాయి. తాజా వానలతో వానకాలం పంటలకు భరోసా దక్కింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాల్లో ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టులతోనే సాగునీరు సరఫరా అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా నిర్వహణ లేకుండా పోయింది. వానకాలం పంటల సీజన్ ముగింపు దశకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి వానల వరకు సాగునీటి సరఫరాపై దృష్టి పెట్టలేదు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీరు సరఫరా చేసే అవకాశం ఉన్నా పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది వానకాలం పంటల సాగు తగ్గింది. సాగుచేసిన పంటలకు నీళ్లు సరిగా లేక రైతులు ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది. ఇదే సమయంలో ప్రకృతి అనుకూలించి వానలు పడడంతో రైతులకు భరోసా కలిగింది.

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను సాగునీటి శాఖ పరంగా వరంగల్, ములుగు యూనిట్లుగా చీఫ్ ఇంజనీరు ఆఫీసులు ఉన్నాయి. వరంగల్ యూనిట్ చీఫ్ ఇంజినీర్ పరిధిలో వరంగల్, మహబూబాబాద్, జనగామ సర్కిళ్లు.. ములుగు యూనిట్ చీఫ్ ఇంజినీర్ పరిధిలో ములుగు, నర్సంపేట సర్కిళ్లు ఉన్నాయి. వరంగల్, ములుగు చీఫ్ ఇంజినీర్ యూనిట్ల పరిధిలో 4,576 చెరువులు ఉన్నాయి. ఇటీవలి వానలతో 3,280 చెరువులు అలుగు పోస్తున్నాయి. మరో 954 చెరువులు పూర్తిగా నిండి ఉన్నాయి. 134 చెరువులు 75 వరకు నీళ్లు ఉన్నాయి. 24 చెరువులు సగం వరకు, 34 చెరువులు పావు వంతు నిండి ఉన్నాయి. సీజన్‌లో తీవ్రస్థాయిలో వానలు వచ్చిన మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని చెరువులు అలుగు పోస్తున్నాయి. వీటిలో పది వరకు చెరువుల కట్టలు తెగిపోయాయి. మహబూబాబాద్ ఇరిగేషన్ సర్కిల్‌లో మొత్తం 674 చెరువులు మత్తడి పడుతున్నాయి. వరంగల్ సర్కిల్‌లోని 791 చెరువుల్లో 544 చెరువులు మత్తడి పడుతున్నాయి. ఈ సర్కిల్ పరిధిలోని 13 చెరువులు పావు వంతు మాత్రమే నిండి ఉన్నాయి.

జనగామ సర్కిల్ పరిధిలో వానలు తక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల పరిధిలోని సాగునీరు సరఫరా చేయకపోవడంతో అన్ని చెరువులు నిండలేదు. ఈ సర్కిల్ పరిధిలోని 966 చెరువుల్లో 430 మత్తడి పోస్తున్నాయి. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని చెరువులకు పూర్తి స్థాయి నీళ్లు రాలేదు. ఈ డివిజన్ పరిధిలోని 586 చెరువుల్లో 234 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయి.

| యూనిట్ | మొత్తం చెరువులు | 25శాతం నిండినవి | 50 శాతం | 70 శాతం | 100 శాతం | మత్తడి |
|---|---|---|---|---|---|---|
| వరంగల్ సీఈ పరిధి | 2431 | 13 | 23 | 132 | 565 | 1648 |
| ములుగు సీఈ పరిధి | 2145 | 21 | 01 | 02 | 489 | 1632 |



మాజీ మంత్రి హరీశ్‌రావు పంపించిన నిత్యావసర సరుకులను బాధిత కుటుంబాలకు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

## రావిరాలకు సర్కారు సాయమేది?

- వారం గడిచినా పట్టించుకున్న వారే లేరు..
- బాధితులకు అండగా బీఆర్‌ఎస్, స్వచ్ఛంద సంస్థలు
- మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్
- 150 కుటుంబాలకు హరీశ్‌రావు అందించిన సరుకులు పంపిణీ

నెల్లికుదురు, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంచెత్తిన రావిరాల గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా సాయం చేయలేదని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మండిపడ్డారు. ఘటన జరిగి వారం రోజులు దాటినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని, బాధితులకు బీఆర్‌ఎస్, స్వచ్ఛంద సంస్థలే అండగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాలకు చెందిన 150 బాధిత కుటుంబాలకు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పంపించిన నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి సీతక్క వచ్చి మాటలు చెప్పిందే తప్ప చేసిన సాయం శూన్యమని ఎద్దేవా చేశారు. ఇండ్లు నేలమట్టమై, నిత్యావసర సరుకులు వరదల్లో కొట్టుకుపోయి ప్రజలు అరిగోస పడుతున్నారని అన్నారు. ఇండ్లు కూలిపోయిన వారికి కొత్తవి నిర్మించి ఇవ్వాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు రూ. 50 వేలు, ఒక్కో బాధిత కుటుంబానికి రూ. లక్ష పరిహారంగా అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, పార్టీ మండలాధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆకుల జగ్గయ్య, నాయకులు బిక్కునాయక్, విజయ్, బత్తిని అనిల్, బానోత్ భీముడు, పులి రామచంద్రు, ఆదిరెడ్డి, కత్తుల ఎలేందర్, బాలునాయక్, భోజ్యానాయక్, శ్రీనివాస్, ఎడ్ల మహేశ్, చారి, శ్రీకాంత్, వెంకన్న, సురేశ్, లక్ష్మణ్, వినోద్, మాన్‌సింగ్, అజిత్, మురళి, శ్రీను, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌పై ముందు చూపేది?



**ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వరంగల్ జిల్లాలో గత నెలలో కొన్ని చౌక దుకాణాల్లో రేషన్ బియ్యం పంపిణీ పదిహేను రోజులు ఆలస్యమైంది. పునరావృతం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నెలలో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ 62 చౌక దుకాణాలకు 531 టన్నుల బియ్యం చేరుకోలేదు. ఒకటో తేదీ నుంచి పంపిణీ చేయాల్సిన పీడీఎస్ బియ్యం ఇంకా రాకపోవడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.** *- వరంగల్, సెప్టెంబర్ 10(నమస్తేతెలంగాణ)*

- గత నెలలో బియ్యం పంపిణీ ఆలస్యమైనా అదే పునరావృతం
- ఇప్పటికీ వరంగల్ జిల్లాలో అందని 531 టన్నుల బియ్యం
- అధికారుల నిర్వాకంతో 62 చౌక దుకాణాలకు చేరుకోని రైస్
- ఒకటో తేదీ నుంచి ఎదురుచూస్తున్న కార్డుదారులు

జిల్లాలో 509 చౌక దుకాణాల ద్వారా ప్రతి నెలా కార్డుదారులకు ప్రభుత్వం సుమారు 4,117 టన్నుల పీడీఎస్ రైస్‌ను పంపిణీ చేయాల్సి ఉంది. విధిగా ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలని ప్రభు త్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అంతకు ముందే అంటే 31లోగా అన్ని చౌక దుకాణాల డీలర్లకు రేషన్ బియ్యాన్ని అందజేయాల్సి ఉంటుంది. పీడీఎస్ రైస్ కేటాయింపులు, డీలర్ డబ్బు చెల్లించడం, పౌరసరఫరాల సంస్థ మండల లెవల్ స్టాక్(ఎంఎల్‌ఎస్) గోదాం నుంచి చౌకదుకాణాలకు రేషన్ బియ్యం చేరుకోవడం వంటివన్నీ నెలాఖరులోగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలి. కొద్ది నెలల నుంచి ఇది సంపూర్ణంగా జరగడం లేదు. ప్రధానంగా స్టేజీ-1 గోదాముల నుంచి ఎంఎల్‌ఎస్ గోదాములకు పీడీఎస్ రవాణాపై ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్, పౌరసరఫరాల సంస్థకు మధ్య వివాదం తలెత్తడంతో గత జూలై నుంచి పీడీఎస్ రైస్ సరఫరా, పంపిణీలో గందరగోళ పరిస్థితి తలెత్తింది. ఆగస్టులో కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ రైస్‌ను జూలై నెలాఖరులోగా చౌక దుకాణాల డీలర్లకు అందజేయాల్సి ఉండగా ఆగస్టు పదహారో తేదీ వరకు కొనసాగింది. చివరకు కొన్ని చౌక దుకాణాల పరిధిలోని కార్డుదారులకు రైస్ పంపిణీ జరుగలేదు.

**ఈ నెలలోనూ అదే పరిస్థితి**

ఆగస్టు 31లోగా 4,117 టన్నుల పీడీఎస్ రైస్‌ను ఎంఎల్‌ఎస్ గోదాంల వద్ద పౌరసరఫరాల సంస్థ అధికారులు అందజేయాల్సి ఉండగా 1,000 టన్నుల రేషన్ బియ్యాన్ని మాత్రమే అందజేసినట్లు తెలి సింది. స్టేజీ-1 గోదాంల నుంచి ఎంఎల్‌ఎస్ గోదాంలకు పీడీఎస్ రైస్‌ను రవాణా చేయడానికి ప్రభుత్వంతో కుదుర్చుకున్న టెండర్ కాలపరిమితి ఒప్పందం గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నందున ట్రాన్స్‌పోర్ట్ రేటు గిట్టుబాటు కావడం లేదని కాంట్రాక్టర్ జూలై నుంచి రవాణా చేయడం లేదు. కరీంనగర్ తదితర జిల్లాల నుంచి సీఎంఆర్ బియ్యాన్ని జిల్లాకు రవాణా చేయడానికి ముందుకు రావడం లేదు. కాంట్రాక్టర్, పౌరసరఫరాల సంస్థ మధ్య ట్రాన్స్‌పోర్టు వివాదం పరిష్కారం కాలేదు. దీంతో స్థానికంగా రైస్‌మిల్లర్లు డెలివరీ చేస్తున్న సీఎంఆర్ బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ గోదాంల ద్వారా పౌరసరఫరాల సంస్థ అధికారులు రేషన్ డీలర్లకు అందజేస్తున్నారు.

**ఇంకా 62 చౌకదుకాణాలకు...**

మంగళవారం వరకు జిల్లాలో 447 చౌక దుకాణాలకు సుమారు 3,586 టన్నుల పీడీఎస్ రైస్ అందజేశారు. ఇంకా 62 షాపులకు సుమారు 531 టన్నుల రేషన్ బియ్యాన్ని అందజేయాల్సి ఉంది. మరి కొద్ది రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. గత నెలలో ఇలాంటి సమస్యే తలెత్తిన దరిమిలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా ఈ నెల 7న వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో రహదారులపై మండపాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో పీడీఎస్ రైస్‌తో వెహికిల్స్ రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నట్లు రేషన్ డీలర్లు తెలిపారు. ఆగస్టులో రేషన్ డీలర్లకు 16వ తేదీ వరకు బియ్యం అందజేసినందున ఈ నెలలో ఎప్పటి వరకు కొనసాగనుంది?, కార్డుదారులకు పీడీఎస్ రైస్ పంపిణీ ఎప్పటివరకు జరుగుతుంది? అనేది చర్చనీయాంశమైంది. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణిని వివరణ కోరగా ఒకటి రెండు రోజుల్లో అన్ని చౌక దుకాణాలకు రేషన్ అందగలవని చెప్పారు.





సమస్యను వివరిస్తున్న కిరాణా షాపు యజమాని ముద్దమల్ల కరుణాకర్, ఆటోలో వచ్చిన మద్యాన్ని వెనక్కి పంపిస్తున్న దృశ్యం

## కిరాణా షాపుల్లో మద్యం అమ్మాల్సిందే..!

- లేదంటే ఎక్సైజ్ అధికారులతో దాడులు చేయించి మూయించేస్తాం
- గ్రామాల్లో మద్యం మాఫియా బెదిరింపులు
- టార్గెట్ ప్రకారం విక్రయాలు జరగాలని హుకుం
- గ్రామాల్లో కల్తీ మద్యం దందా

ములుగు, సెప్టెంబర్10(నమస్తేతెలంగాణ): బతుకుదెరువు కోసం పెట్టుకున్న చిన్న చిన్న కిరాణా షాపులు, బడ్డీ కొట్లలో మద్యం అమ్మాల్సిందేనంటూ వ్యాపారులు ఓ ముఠాగా ఏర్పడి బెదిరిస్తున్నారు. మాట వింటే రోజు ఆటోలో ఉదయం 9 గంటల లోపే మద్యం వస్తుందని, లేదంటే సాయంత్రం ఎక్సైజ్ అధికారులు వస్తారంటూ భయపెడుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి ముద్దమల్ల కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. లాభం వస్తుందనే ఉద్దేశంతో వెంకటాపూర్ షాపు నుంచి మద్యాన్ని తీసుకొచ్చి కొన్ని రోజులుగా విక్రయించా. ఆ తర్వాత తమ షాపు వద్దకు రావద్దని, తామే ఆటోలో డెలివరీ చేస్తామని, తమ మద్యమే విక్రయించాలని వ్యాపారి హుకుం జారీ చేశాడు. వేరే దుకాణాల్లో తెస్తే ఎక్సైజ్ అధికారులతో దాడులు చేయించి షాపును మూసివేయిస్తానని బెదిరించాడు. దీంతో తాను మద్యాన్ని అమ్మడం మానేశాను. ఈ క్రమంలో సోమవారం మద్యం షాపునకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి షాపులో ఇతర మద్యం ఏమైనా విక్రయిస్తున్నాడా అనే అనుమానంతో తనిఖీలు చేసి సామాన్లను చిందరవందర చేశారు. మద్యం వ్యాపారులు వచ్చి తన షాపులో తనిఖీలు చేయడం ఏమిటని కరుణాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, మంగళవారం ఆటోలో వెంకటాపూర్ షాపు నుంచి మద్యాన్ని పంపించగా కరుణాకర్ ఆటో డ్రైవర్‌తో వాగ్వాదం చేసి తాను దుకాణంలో మద్యం అమ్మనని తిరిగి వెనక్కి పంపించాడు.

**ఎమ్మార్పీ కంటే రూ. 30 అదనం**

గ్రామాల్లో కిరాణా షాపులు నడుపుతున్న వారిని టార్గెట్ చేస్తూ వ్యాపారులు కల్తీ మద్యం విక్రయ దందాకు తెరలేపుతున్నారు. కిరాణా దుకాణాలను బెల్ట్ షాపులుగా మార్చుతున్నారు. ఎంఆర్‌పీ కంటే రూ.30 అదనంగా దుకాణాదారులకు మద్యాన్ని డెలివరీ చేస్తూ తమ దందాను విస్తరిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలపై కొరడా ఝులిపించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి నిబంధలను గాలికి వదిలేస్తున్నారు. టార్గెట్లు పూర్తి చేయాలని భావనతో మద్యం సిండికేట్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఇది చాలదన్నట్లు వ్యాపారులు ఏ షాపుపై దాడులు చేయాలో చెబితే అదే పాటించడం అలవాటుగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి దందాకు చెక్ పెట్టాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.

## గోదావరి ఉగ్రరూపం



పుష్కరఘాట్ వద్ద మునిగిన మెట్లు

*పుష్కరఘాట్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువ*

ఏటూరునాగారం, సెప్టెంబర్ 10 : రెండు రోజులుగా గోదావరి ఉగ్రరూపం దాల్చుతున్నది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో వేగంగా పెరిగిన గోదావరి రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పుష్కరఘాట్ వద్ద 15.800 మీటర్లకు చేరుకుంది. 15.830 మీటర్లకు చేరితే రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేస్తారు. పుష్కరఘాట్ మెట్లు మునిగి గంగానమ్మ గుడి వద్దకు చేరుకున్నది. ఇక రామన్నగూడెం-రాంనగర్ మధ్యలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వాగు మార్గంలో గోదావరి వరద చేరి పంట భూములను ముంచెత్తింది. పెరుగుతున్న గోదావరి ప్రవాహానికి రామన్నగూడెం ఎగువ భాగంలో ఒడ్డు కోతకు గురవుతున్నది. ఇక ముల్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది.



చిట్యాల శ్వేతను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## చిట్యాల శ్వేతకు అరుదైన అవకాశం

*రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియామకం*

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 10 : చిట్యాల ఐలమ్మ వారసురాలికి అరుదైన అవకాశం దక్కింది. ఆమె ముని మనుమరాలు శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను ఆదేశించగా త్వరలో నియామక ఉత్తర్వులను అందజేస్తామని చెప్పారు. కాగా శ్వేత చిట్యాల ఐలమ్మ మనుమడు, పాలకుర్తి మాజీ సర్పంచ్ చిట్యాల రాంచంద్రం కోడలు.

## కుంట కట్టను బాగుచేశారు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయపురం శివారులో తెగిపోయిన అన్నసాని కుంట కట్టను మొరంపోసి బాగుచేశారు. మంగళవారం 'దాటుడు కట్టమే' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించి కట్టను బాగుచేయడంతో బక్కతండా గ్రామ పంచాయతీతోపాటు పోట్యతండా, వంకాలతండా, బండమీదితండా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

*- నర్సింహులపేట, సెప్టెంబర్ 10*

## ఇంకా చాలా బెంచ్‌లు ఉన్నాయి..

- హైకోర్టు తీర్పును గౌరవిస్తాం
- ఉపఎన్నికలు వస్తాయో లేదో తెలియదు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 10 : పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని.. ఆ తీర్పుతో అయిపోలేదని, ఇంకా బెంచ్‌లు ఉన్నాయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జడ్జి ఇచ్చిన తీర్పు కాపీలు ఇంకా తమకు అందలేదని, దీనిపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయనిపుణుల సలహాల మేరకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. అప్పుడే ఉపఎన్నిక వచ్చినట్లు కొందరు సంబురాలు చేసుకోవడం వారికే తెలియాలన్నారు. అసలు ఉప ఎన్నికలు వస్తాయో, లేదో తెలియదని శ్రీహరి అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.